


# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**JUNE - 2015**

సంవత్సర చందా రూ. 50/-

# సంక్షిప్త వార్తలు

2015 ఏప్రియల్ 28, 29,30 తేదీలలో కాకినాడ మరణయ్య పేట, ఇందిరా కోలనీ క్రీస్తు సంఘము గొప్ప సువార్త సభలను నిర్వహించిరి. రమణయ్య పేట M.D.O. ఆఫీసు ప్రక్కన యున్న ఖాళీస్థలములో ప్రతి రాత్రి 7.00 గంటలకు ఈ కూటములు ఘనముగా నిర్వహించబడెను. స్థానికులు, పలుగ్రామలము నుండి వచ్చిన వందలాది ప్రజలు చక్కటి వాతావరణములో దేవుని వర్తమానముల నాలకించిరి. సోదరులు జాషువాగూటంగారు, జి.దేవదానం గారు (హైదరాబాద్) వాక్యపరచర్య చేసిరి. ప్రతిరాత్రి వచ్చినవారందరికీ స్థానిక సంఘము భోజనముల నేర్పాటు చేసిరి. ప్రతిరోజు ఉదయం 10 గంటలకు బోధకులకు ప్రత్యేక బైబిలు తరగతులు నిర్వహించబడెను. సోదరులు దేవదానంగారు అందు వాక్యోపదేశము గావించిరి. ఇందిరా కోలనీ క్రీస్తు సంఘము, సోదరులు పి.వి. రావుగారి ఆధ్వర్యములో ఈ సువార్త కూటములను ఘనముగా నిర్వహించి ప్రభువుకు మహిమ తెచ్చినందుకు అభినందనీయులు.

2015 మే నెల 1,2 తేదీలలో, కాకినాడ వెంకటకృష్ణరాయపురం, లాకు దగ్గర పేటలో యున్న క్రీస్తు సంఘము గొప్ప సువార్త మహాసభలను నిర్వహించిరి. సోదరులు జాషువాగూటం గారు, ఎ.గోపాలకృష్ణగారు వాక్యోపదేశము గావించిరి. అనేక మంది హాజరై సత్యవాక్యమును విని గ్రహించుకోగల్గిరి. స్థానిక సువార్తికులు బ్రదర్ డి. రాజరత్నంగారు, వారి కుటుంబసభ్యుల యొక్క నిర్విరామకృషి వలన కూటములు అత్యంత ఆహ్లాదరకముగా, జయప్రదముగా జరిగించబడెను.

2015 మే నెల 4,5 తేదీలలో రామచంద్రపురం జల్లివారి పేటలో యున్న క్రీస్తుసంఘము సువార్త సభలను నిర్వహించిరి. మొదటి రోజు కె.జి. కుమార్ గారు, రెండవ రోజు జాషువాగూటం గారు వాక్యపరిచర్య చేసిరి. వందలాది మంది హాజరైఆశ్చర్యకరమైన దేవుని ప్రేమను గూర్చి విని ఆశ్చర్యచకితులైరి. జల్లివారి పేటలో సోదరులు కె.విజయ కుమార్ గారు క్రీస్తు కొరకు పేటలో మంచి పనిచేయుచున్నారు.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH



P.o. Box -80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**


*Pleading for Restoration of First Century Christianity*


సంపుటి - 35 | జూన్ - 2015 | సంచిక - 11


## యేసుక్రీస్తు బోధించిన రీతి

(How Jesus Christ Taught)

ఈ లోకమందు ఉద్భవించిన బోధకులందరికంటే యేసుక్రీస్తు గొప్ప బోధకుడు. ఆయన చేసిన అద్భుతములు గొప్పవి, గాని ఆయన చేసిన బోధలు మరింత గొప్పవి. ఈ పాఠములో ఆయన చేసిన బోధనలను గూర్చి కొన్ని ముఖ్యాంశములను గమనింతము.

యేసుక్రీస్తు చాల సులభ పద్ధతిలో ప్రజలకు బోధించెను. సామాన్య ప్రజలు కూడ అర్థము చేసుకొనగల్గునట్టి మాటలను ఆయన ఉపయోగించి బోధించెను. వారందరు యెరిగిన సంగతులనే ఉదాహరణలుగా ఆయన ఉపయోగించెను. ఆయన గొప్ప గొప్ప ఆత్మీయ సూత్రములను ఉపమానములను ఉపయోగించి బోధించెను. ఉపమానమనగా పరలోక సంబంధమగు ఒక చిన్న కధయని మనము చెప్పుకొనవచ్చును. తప్పిపోయిన కుమారుని గూర్చి యేసు చెప్పిన కధ మనందరము ఎరిగినదే. ఆ కధలో చిన్న కుమారుడు తన తండ్రినుండి తనకు వచ్చు ఆస్థితిని బలవంతముగా తీసుకొని దూరదేశమునకు పోయి ఆ డబ్బంతిటిని వ్యర్థముగా ఖర్చుపెట్టి చివరకు తినడానికి తిండి లేకపోగా తాను మేపు

పందుల పొట్టును తినుటమట్టుకు ఆశించెను. అయితే బుద్ధి వచ్చినప్పుడు అతడు తన తండ్రి యొద్దకు తిరిగి వెళ్ళి, క్షమించమని, తన దాసులలో ఒకనిగా నుంచుకొనుమని తండ్రిని బతిమాలెను. తండ్రి అయితే మహా సంతోషముతో వానిని తన కమారునిగా చేర్చుకొనెను (లూకా 15:11-32). ప్రజలను సంతోష పెట్టుటకు యేసు ఈ ఉపమానమును చెప్పలేదు. దాని ద్వారా ఆయన ఒక గొప్ప ఆత్మీయ పాఠమును మనకు నేర్పించెను. ఆ చిన్న కుమారునివలె మనందరము పాపములో బడి తండ్రియైన దేవుని నుండి తప్పిపోయిన వారమైయున్నాము. మనము మారుమనస్సు నొంది తిరిగి దేవుని యొద్దకు చేరుకొనులాగున పరమందున్న ఆ తండ్రి మన యెడల మితిలేని ప్రేమను, దీర్ఘశాంతమును కలిగియున్నారు. మనము విరిగి నలిగిన హృదయము కలిగి ఆయన యొద్దకు వచ్చిన యెడల ఆయన మనలను తన కుమారులనుగా స్వీకరించుటకు యెదురు చూచుచున్నారు.

ఇంత చక్కని ఉపమానములను యేసు అనేకములను బోధించెను. ఆయన చెప్పిన ఉపమానములలో కొన్ని మాత్రమే క్రొత్త నిబంధనలో మత్తయి, మార్కు, లూకా, యోహాను అను సువార్తలలో మనకు కన్పడగలవు. విత్తువానిని గూర్చి ఆయన చెప్పన ఉపమానము కూడ చాల గొప్పది. "విత్తువాడు తన విత్తనములు విత్తుటకు బయలుదేరెను. అతడు విత్తుచుండగా కొన్ని విత్తనములు త్రోవ ప్రక్కనుపడి త్రొక్కబడెను గనుక ఆకాశపక్షులు వాటిని మ్రింగివేసెను. మరికొన్ని రాతినేలను పడి, మొలచి, చెమ్మలేనందున ఎండిపోయెను. మరి కొన్ని ముండ్లపొదల నడుమ పడెను. ముండ్లపొదలు వాటితో మొలచి వాటి నణచివేసెను. మరికొన్ని మంచినేలను పడెను అవి మొలచి నూరంతలుగా ఫలించెను" అని యేసు చెప్పెను (లూకా 8:4-8). యేసు ఈ ఉపమానము యొక్క భావమును ఆయన శిష్యులకిట్లు చెప్పెను. విత్తనము దేవుని వాక్యము. దేవుని వాక్యము విత్తబడుచుండగా వినుచున్న వారు నాలుగురకములైన హృదయమును కలిగినవారు త్రోవప్రక్క నుండువారు వినువారుగాని నమ్మి రక్షణ పొంద కుండునట్లు అపవాది వచ్చి వారి హృదయములో నుండి వాక్యమెత్తుకొని పోవును. రాతినేలనుండు వారెవరనగా వినునప్పుడు వాక్యమును సంతోషముతో అంగీకరించువారు గాని, కొంచెము కాలము నమ్మిశోధన కాలమున తొలగి పోవుదురు. ముండ్లపొదలలో పడిన విత్తనమును పోలినవారెవరనగా, విని కాలము గడచిన కొలదీ యీ జీవ సంబంధమైన విచారముల చేతను, ధనభోగములచేతను అణచివేయబడి

పరిపక్వముగా ఫలింపనివారు మంచి నేలనుండు విత్తనమును పోలిన వారెవరనగా యోగ్యమైన మంచి మనస్సుతో వాక్యము విని దానిని అవలంబించి ఓపికతో ఫలించువారు (లూకా 8:11-15).

యేసు తన చుట్టూయున్న ప్రజలను ఒక్కోసారి ప్రశ్నించి ప్రయోజనాత్మక పాఠములను నేర్పెను, ఒక నాడు ఆయన జన సమూహములతో మాటలాడుచుండగా ఆయన తల్లియు, ఆయన సహోదరులును ఆయనతో మాటలాడగోరుచు వెలుపల నిలిచి యుండిరి. అప్పుడొకడు ఇదిగో నీ తల్లియు, నీ సహోదరులును నీతో మాటలాడగోరుచు వెలుపల నిలిచి యున్నారని ఆయనతో చెప్పెను. అందుకాయన నా తల్లి యెవరు ? సహోదరులెవరు? అని చెప్పి తన శిష్యుల వైపు చెయ్యి చాపి - ఇదిగో నా తల్లియు నాసహోదరుడును, నా సహోదరియు, నాతల్లియుననెను (మత్తయి 12:46-50).

యేసు యొక్క శత్రువులు ఆయనను శోధించుటకు ప్రశ్నలు వేస్తూయుండేవారు. వారి ప్రశ్నలపై తిరిగి ప్రశ్నలు వేస్తూ యేసు జవాబిచ్చుచుండెను. వారాయన ప్రశ్నలకు జవాబీయ లేనియెడల వారి ప్రశ్నలకు ఆయన కూడా జవాబీయకుండెను.

ఒకరోజు యేసు "దేవాలయములోనికి వచ్చి బోధించుచుండగా ప్రధాన యాజకులును, ప్రజల పెద్దలును ఆయన యొద్దకు వచ్చి - ఏ అధికారము వలన నీవు ఈ కార్యములు చేయుచున్నావు ?ఈ అధికారము ఎవడు నీకిచ్చెనని అడుగగా - యేసు నేనును మిమ్మును ఒక మాట అడుగుదును. అది మీరు నాతో చెప్పిన యెడల నేనును ఏ అధికారము వలన ఈ కార్యములు చేయుచున్నానో అది మీతో చెప్పుదును. యోహాను ఇచ్చిన బాప్తిస్మము ఎక్కడ నుండి కలిగినది ? పరలోకము నుండి కలిగినదా? మనుష్యులనుండి కలిగినదా? అని వారినడిగెను. వారు - మనము పరలోకము నుండి అని చెప్పితిమా, ఆయన - అలాగైతే మీరెందుకు అతని నమ్మలేదని మనల నడుగును; మనుష్యుల వలనని చెప్పితిమా జనులకు భయపడుచున్నాము; అందరు యోహాను ప్రవక్తయని యెంచుచున్నారని తమలోతాము ఆలోచించుకొని - మాకు తెలియదని యేసునకు ఉత్తరమిచ్చిరి. అందుకాయన ఏ అధికారము వలన ఈ కార్యములు నేను చేయుచున్నానో అదియు మీతో చెప్పను" అని వారికి జవాబిచ్చెను (మత్తయి 21:23-27).

ఒకరోజు దయ్యము పట్టిన గ్రుడ్డివాడును మూగవాడునైన యొకడు యేసుయొద్దకు తేబడెను ఆయన వానిని

స్వస్థపరచినందును ఆ మూగవాడు మాటలాడు శక్తియు, చూపును గల వాడాయెను. అందుకు ప్రజలు విస్మయ మొంది – ఈయన దావీదు కుమారుడు కాడా, అని చెప్పుకొనుచుండిరి. పరిస య్యులు ఆమాట విని – వీడు దయ్యము లకు అధిపతియైన బయెల్జె బూలు వలననే దయ్యములను వెళ్ళ గొట్టు చున్నాడు గాని మరియొకని వలన కాదనిరి. ఆయన వారి తలంపుల నెరిగి వారితో ఇట్లనెను. తనకు తానే విరోధ ముగా వేరుపడిన ప్రతి రాజ్యము పాడైపోవును. తనకుతానే విరోధముగా వేరుపడినయే పట్టణమైనను, ఏ యిల్ల యినను నిలువదు. సాతానుసాతానును వెళ్ళగొట్టిన యెడల తనకు తానే విరోధముగా వేరు పడును; అట్ల యితే వాని రాజ్యమేలాగు నిలుచును? నేను బయెల్జెబూలు వలన దయ్యములను వెళ్ళగొట్టుచున్న యెడల మీ కుమారులు ఎవరి వలన వాటిని వెళ్లగొట్టుచున్నారు? కాబట్టి వారేమీకు తీర్పరులైయుందురు. దేవుని ఆత్మ వలన నేను దయ్యములను వెళ్ల గొట్టుచున్న యెడల నిశ్చయముగా దేవుని రాజ్యము మీ యొద్దకు వచ్చి యున్నదని చెప్పి యేసు వారి హృదయ తలంపులను ఖండించెను. (మత్తయి 12:22–28).

యేసుక్రీస్తు ఈ లోకములో యుండగా అనేక రీతులుగా,ఉదాహరణల ద్వారాను, ఉపమానముల ద్వారాను, ప్రశ్న – జవాబుల ద్వారాను దేవుని రాజ్యమును గూర్చి ప్రజలకు బోధించెను. ఆయన బోధించునప్పుడు అధికారముగల వానివలె బోధించెను. అందు వలన జనసమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడుచుండిరి. ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలె కాక అధికారము గలవానివలె వారికి బోధించెను (మత్తయి 7:29). యేసు దేవుని కుమారుడు గనుక సర్వాధికారియై యున్నారు. మనము ఆయనను ఆయన బోధను అంగీకరించిన యెడల మోక్షమును ఆయన మనకు ప్రసాదించును. ఆయన బోధను మనము నిరాకరించిన యెడల నిత్య శిక్ష మనకు తప్పదు. "క్రీస్తు బోధయందు నిలిచి యుండక దానిని విడిచి ముందుకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరిం పనివాడు; ఆ బోధయందు నిలిచి యుండు వాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడని" వ్రాయబడియున్నది (2 యోహాను :9).

యేసుక్రీస్తునందు విశ్వాస ముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సునొందుము. క్రీస్తునందున్న విశ్వాసమును మనుష్యులయెదుట ఒప్పుకొనుచూ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. అప్పుడు యేసుప్రభువు నిన్ను తన రాజ్యమైన సంఘముతో చేర్చుకొనును.

# నైవేద్య అర్పణ
## (The Grain offering)

**దేవుని బల్యర్పణ పద్ధతి – 9**

ఈయర్పణను వర్ణించుటకు గాను కొర్బాను అను హెబ్రీ పదము వాడబడినది. కొర్బాను అనగా దేవుని కీయబడినదని యర్ధము. మార్కు 7:11 లో ఈపదము అట్లు వాడబడినది. పాతనిబంధనలో ఇట్టి యర్పణలు ఇయ్యబడిన సందర్భములు మనకు కొన్ని కలవు, అవి అర్పింపబడే వ్యక్తి యొక్క తాహతును బట్టి అవి ఇయ్యబడేవి. అవి పుచ్చుకొను వానికిని ఇచ్చువానికిని మధ్య స్నేహపూర్వక వాతావరణము కల్పించుటకు గాను ఇయ్యబడేవి.

ఆదికాండము 32:13లో యాకోబు, ఏశావుకు యిట్టియర్పణను యిచ్చుట చూడగలము. అతని యొక్క ఆమోదము కోరుటకుగాను ఈ యర్పణ ఇయ్యబడినది. ఆదికాండము 43:11లో 12 గోత్రములవారి తండ్రియైన ఇశ్రాయేలు ఐగుప్తు దేశములో పాలకుడైన యోసేవుకు ఈ కొర్బాను పంపెను. 2 సమూ 8:2 లో మోయాబీయులు దావీదుకు అర్పణలు సమర్పించుట చూడగలము. ఇట్టి బహుమతులు పుచ్చుకొను వానియొక్క ఘనతను గుర్తించుచు ఇయ్యబడెను. దేవుని యొక్క ఘనతను గుర్తించటయేగాక ఆయన యొక్క మంచితనమునకు, కాపుదలకు గురుతుగా యివిఇయ్యబడెను.

నాకున్నదంతా :

భూమిలో పండిన ప్రధమఫలములను ఇశ్రాయేలీయుల నుండి దేవుడు కోరారు. భూఫలములలోను, పశువుల ఫలములలోను కూడ దేవుడు ప్రధమ ఫలములను ఇశ్రాయేలీయుల నుండి కోరారు. అది ఇంపైన సువాసనగల అర్పణలోనికి వచ్చు యాగమైయున్నది. గనుక యిది కేవలము ఆరాధన సంబంధమైన, స్తోత్రార్హ సంబంధమైన అర్పణయే. దహనబలి యర్పణలోవలె హెబ్రీయుడు, దేవునితో "నాసమస్తము నీకు సమర్పించ యిష్టపడుచున్నానని" తలంచును. మరియు ఈ నైవేద్య అర్పణలో హెబ్రీయుడు దేవునికి సంపూర్తిగా ఎట్లు సమర్పించుకొన్నాడో తెలిసికోగలము.

మానవుని శ్రమ ఫలితమే .....

పండించిన ధాన్యములే ఈ యర్పణలో అర్పించాలి గాని అవి ధాన్య రూపమున కాదు. అవి పిండిగా చేయబడిగాని లేదా పేల్చబడిగాని అర్పింపబడాలి. ఇశ్రాయేలీయులు సాధారణముగా పండించిన ధాన్యమును పిండి

చేసి, అప్పడములుగా చేసి వాటిని యాజకుని దగ్గరకు తీసికొని రాగా అతడు బలిపీఠము మీద వాటిని దేవునికి సమర్పిస్తాడు. అప్పుడు యాజకుడు దానిలో ఒక భాగము బలిపీఠము మీద యెహోవాకు ఇంపైన సువాసనగల హోమముగా దానిని దహించును. నిజానికి యిది అతిపవిత్రమైన ఆరాధనయై యున్నది. దేవుని యెడల కలిగిన గొప్ప కృతజ్ఞతాభావము ఇందులో ఇమిడి యున్నది.

ఈ నైవేద్య అర్పణలో ఒక వ్యక్తికి కలిగిన వాటిని దేవునికి సమర్పించుట ముఖ్య ఉద్దేశ్యమై యున్నది. ఒక మనుష్యుని యొక్క భక్తి జీవితానికి భౌతిక జీవితానికి వ్యత్యాస మేమిలేదు. ఏలయనగా మానవుని జీవితమంతయు శరీరము, ఆత్మ, ప్రాణము అంతా దేవునికే చెందును. అదంతా దేవునికే సమర్పితము (కొర్బాను). అందు వలన ఒకని ఆత్మీయ జీవితములో ఆదివారమునకు, మిగతా దినములకు తేడా యేమీవుండ కూడదు. "కాబట్టి మీరు భోజనము చేసినను. పానము చేసినను మీరేమి చేసినను సమస్తమును దేవుని మహిమ కొరకు చేయుడి" యని పౌలు చెప్పెను (1కొరింథీ 10:31). గనుక ఈ యర్పణ దేవుని యొక్క కాపుదలకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుటకు ఉద్దేశించబడినది.

దేవుడు ఇశ్రాయేలీయులకు కానాను దేశము అప్పగించుటే గాక వారికి ఆదేశము యొక్క ప్రథమఫలముల నిచ్చారు. గనుక వారు ఆ ప్రథమ ఫలములను, పాలు తేనెలలోని కొంత భాగమును, పంటలోని ప్రథమ ఫలము లను తీసికొని వచ్చి యెహోవా దేవునికి స్తుతి చెల్లించుటకర్పింతురు.

**చేరెడు నూనెయు, చేరెడు పిండియు :**

దేవుడు వారినుండి పంట మొత్త మును కోరలేదు. గోధుమ పిండియు, దాని సాంబ్రాణి అంతయు తీసికొని యెహోవాకు ఇంపైన సువాసన గల హోమముగా బలిపీఠము మీద అందులో ఒక భాగమును జ్ఞాపకార్థముగా దహించును. చేరెడు పిండి యనగా ఒక మనుష్యునికి ఒక రోజు భోజనమునకు సరిపడునంతయని గ్రహించుకొనదగును. మరియు యెహోవా మనుష్యుల యొక్కయు, పశువుల యొక్కయు, పొలముల యొక్కయు ప్రథమఫలములను కోరెను. చేరెడు పరిశుద్ధమైతే పంట అంతయు దేవునికి పరిశుద్ధమే. "ముద్దలో మొదటిపిడికెడు పరిశుద్ధ మైనదైతే ముద్దంతయు పరిశుద్ధమే" (రోమా 11:16).

ఈయర్పణతో సాంబ్రాణి చేర్చ బడును. బైబిలులో సాంబ్రాణి ఎల్లప్పుడు ప్రార్థనకు సూచనగా యున్నది. గనుక

హెబ్రీయుడు ఈ నైవేద్య అర్పణను ప్రార్థన పూర్వకముగా అర్పించేవాడు. తదుపరి నూనె కూడ పిండితో చేర్చబడెను. యిది బహుశ ఒలీవ నూనె అయ్యుండవచ్చును లేదా గింజల నూనె కావచ్చును. పాత, క్రొత్తనిబంధనలలో నూనె ఎల్లప్పుడు ప్రతిష్టతను సూచించును. పాతనిబంధనలో దేవుని పరిచర్యకు ఉద్దేశించబడిన వారు నూనెతో ప్రతిష్టింపబడేవారు. ప్రవక్తలు, యాజకులు, రాజులు దేవుడు తమకేర్పాటు చేసిన పని విషయమై నూనెతో అభిషేకము చేయబడి ప్రతిష్టింపబడే వారు. (కీర్తన 133:1-3 చదువుము). మోషే అహరోనును అతని కుమారులను యాజకులుగా ప్రతిష్టించిన సందర్భము, విధానము లేవీకాండము 8,9 అధ్యాయాలలో మనకు కనబడును.

మూడవదిగా నైవేద్యమునకు ఉప్పు చేర్చబడేది. పాతనిబంధనలోను క్రొత్తనిబంధనలోను కూడ ఉప్పు నిబంధనకు గురుతు. సాంబ్రాణి ప్రార్థనకు ఏలాగు గురుతో ఉప్పు ఎల్లవేళలా నిబంధనకు, ఒడంబడికకు గురుతు. నిబంధన సంబంధమును స్థిరపరచుటకు, నూతన పరచుటకు ఉప్పు ఎల్లవేళలా ఉపయోగించబడేది. నిబంధనను నూతన పరచుటకు దహన బలి మధ్యకు ఎట్లు విభాగింపబడేదో, అట్లే నైవేద్య అర్పణకు ఉప్పుచేర్చబడేది. "నీవు అర్పించు ప్రతినైవేద్యమునకు ఉప్పు చేర్చవలెను. నీ దేవుని నిబంధన యొక్క ఉప్పు నీ నైవేద్యము మీద ఉండవలెను, నీ అర్పణలన్నిటితోను ఉప్పు అర్పింపవలెను" (లేవీ 2:13).

క్రైస్తవులు దేవునికి కానుకలిచ్చునప్పుడు గొప్ప ఆత్మీయ భావముతో ఈమూడింటిని వాటితో చేర్చవలెను. సాంబ్రాణికి సాదశ్యమైన ప్రార్థన, నూనెకు సాదృశ్యమైన వ్యక్తిగత ప్రతిష్టిత, ఉప్పు నిబంధనకు సాదృశ్యమైన దేవునితో గల వ్యక్తిగత బాధ్యత కలిగి తమయర్పణలు అర్పింపవలెను.

మార్కు 9:49-50 లో యేసు "ప్రతివానికి ఉప్పు సారము అగ్ని వలన కలుగును. ఉప్పు మంచిదే గాని ఉప్పు నిస్సారమైన యెడల దేనివలన మీరు దానికి సారము కలుగజేతురు? మీలో మీరు ఉప్పుసారముగలవారై యుండి యొకరితో ఒకరు సమాధానముగా ఉండుడని చెప్పెను" ఇక్కడ చెప్పబడిన అగ్ని లేవీ 2లో ఆరాధకుడు తన నైవేద్యమునకు ఉప్పు బలిపీఠముపై దహించుటను గుర్తుచేయును. ప్రభువు తన రాజ్యములో యున్న ప్రతివాడు ఆయనతో సన్నిహితనిబంధన కలిగి యుండాలని కోరుకొనును. ఒకడు తన ఉప్పుసారము పోగొట్టుకొంటే, ఆయతో గల నిబంధన సంబంధమును పోగొట్టు

కొంటే అతడు ఇంపైన సువాసన గలవాడెట్లవుతాడు? అతడు దేవునికి ఇష్టుడుగా యుండుట అసాధ్యము.

ఒకడు అర్పించే నైవేద్యముతో మూడు పదార్థములు చేర్చబడితే రెండు సంగతులు దానితో చేర్చకూడదని చెప్పబడినది, మొదటిది పులిసిన దానిని చేర్చకూడదు, రెండవది తేనె చేర్చ కూడదు (లేవీ 2:11-4) కుళ్లి పోవుటను సూచించును. పులిసినదియేదీ ఎక్కువ కాలము నిలువయుండదు. అదే రీతిగా తేనె కూడ పులియ వచ్చును. అందు వలన ఈ రెండు నైవేద్యర్పణతో చేర్చ రాదు. ఈ రెండు చెడ్డవని కాదు, లేవీ 2:12 ప్రకారము వాటిని ప్రథమ ఫలములుగా అర్పించవచ్చును గాని, నైవేద్యర్పణతో మాత్రమే వాటిని చేర్చ వలదు.

పస్కానాడు ఇశ్రాయేలీయులం దరు వారి యిండ్లలోను పులిసిన దాని నంతను బహిష్కరించాలని ఆజ్ఞాపింప బడెను. అది ఐగుప్తీయుల అవినీతికి, అక్రమముకు గురుతు. 'పరిసయ్యులు సద్దూకయ్యులు అను వారి పులి పిండిని గూర్చి జాగ్రత్తపడుడని" యేసు హెచ్చ రించారు (మత్తయి 16:6). లూకా 12:1 లో పరిసయ్యుల వేషధారణయను పులి పిండిని గూర్చి ఆయన హెచ్చరించారు. పౌలు క్రైస్తవులను హెచ్చరించుచు, "మీరు పులిపిండి లేనివారు గనుక క్రొత్త ముద్ద అవుటకై ఆపాతదైన పులిపిండిని తీసి పారవేయుడి. ఇంతే గాక క్రీస్తు అను మన పస్కాపశువు వధింపబడెను. గనుక పాతదైన పులిపిండితోనైనను, దుర్మార్గతయు దుష్టత్వమునను పులిపిండి తోనైనను కాకుండ నిష్కాపట్యమును, సత్యమునను పులియనిరొట్టెతో పండుగ ఆచరింతము" అని చెప్పాడు (1 కొరింథీ 5:6-8).

**యేసు యొక్క ప్రథమఫలములు :**

ప్రథమ ఫల నైవేద్య అర్పణ యేసుక్రీస్తుకు ఛాయగా యుండి ఆయన లో నెరవేరుచున్నది. యేసు ప్రభువు కూడ తన పరిచర్యలో ప్రథమఫలము లనర్పించెను. అయితే ఆయన పరిచర్య యేమిటి ? వడ్రంగి వాని పరిచర్యా? కానేకాదు ! ఆయన రక్షకుడు ! గనుక రక్షింపబడిన వారే ఆయన ప్రథమ ఫలములు !.

2 కొరింథీ 2:14-15లో పౌలు. "మాద్వారా ప్రతిస్థలమందును క్రీస్తును గూర్చిన జ్ఞానము యొక్క సువాసనను కనబరచుచు ఆయనయందు మిమ్మును ఎల్లప్పుడు విజయోత్సవముతో ఊరేగిం చుచున్న దేవునికి స్తోత్రము. రక్షింపబడు చున్నవారిపట్లను, నశించువారిపట్లను మేము దేవునికి క్రీస్తు సువాసనయై

యున్నాము" అని చెప్పెను. క్రైస్తవులు క్రీస్తు దేవుని యొక్క ఇంపైన సువాసనయై యున్నారు.

"ఆయన తాను సృష్టించిన వాటిలో మనము ప్రథమఫలముగా ఉండునట్లు సత్యవాక్యము వలన మనలను తన సంకల్పము ప్రకారము కనెను" అని యాకోబు 1:18 చెప్పుచున్నది. యేసుక్రీస్తు యొక్క రక్షణ పరిచర్యలో క్రైస్తవులు ఆయన ప్రథమ ఫలమై యున్నారు. ప్రకటన 14:4 లో రక్షింపబడిన 144 వేల మందిని గూర్చి చెబుతు వారు "గొర్రెపిల్ల ఎక్కడికి పోవునో అక్కడికెల్ల ఆయనను వెంబడింతురు, వీరు దేవునికొరకును గొర్రెపిల్ల కొరకును ప్రథమఫలముగా ఉండుటకై మనుష్యులలోనుండి కొనబడినవారని" చెప్పబడినది. ఈ సందర్భములన్నియు పాతనిబంధనలోని నైవేద్య ప్రథమఫల అర్పణల సారూప్యముగాను, వాటి నెరవేర్పు గాను యేసు ఉన్నట్లు తెలియ జేయుచున్నవి.

**క్రైస్తవులు వారినైవేద్యార్పణ :**

క్రైస్తవులు హెబ్రీయులవలె భౌతికంగా గాక ఆత్మీయముగా తమ నైవేద్యార్పణలను దేవునికి అర్పింతురు. మన అర్పణలు మన శ్రమ యొక్క ప్రథమ ఫలములు. అవి దేవునికి చెందును. అవి ఆర్థికపరమైన అర్పణలు "అవి మనోహరమైన సువాసనయు దేవునికి ప్రీతికరమును ఇష్టమునైన యాగమునై యున్నదని" పౌలు చెప్పాడు (ఫిలిప్పీ 4:18). మరల హెబ్రీ 13:15లో "కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడు స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వా ఫలము అర్పించుదము. ఉపకారమును ధర్మమును చేయ మరచిపోకుడి, అట్టి యాగములు దేవుని కిష్టమైనవియని చెప్పెను. ప్రథమ ఫల అర్పణలలో స్తుతి, ఒప్పుకోలు, ఉపకారము, ధర్మము మొదలగునవి ఇమిడి యున్నవి.

1పేతురు 2:5,9 లో చెప్పబడిన మాటలు పాతనిబంధనలోని రూపముల ప్రతిరూపములని గమనించవచ్చును. పేతురు క్రైస్తవులను పరిశుద్ధమైన ఆలయముగాను, రాజులైన యాజకులుగాను, ఆత్మీయ బలులు అనుకూలములగు ఆత్మసంబంధమైన బలులు అర్పించువారిగాను, అక్కడ వర్ణించాడు. "యేసు క్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మసంబంధమైన బలులు నర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు మీరును సజీవమైన రాళ్లవలెనుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు"

(1 పేతురు 2:5). దేవునికి అనుకూలములగు అనగా ఆయనకు ఇంపైన సువాసనగల అర్పణలోనికి వచ్చును.

**సువార్త పరిచర్య దేవునికియ్యబడు అర్పణ :**

రోమా 15:15-16 లో పౌలు ఇట్లు వ్రాసాడు : " అయినను అన్యజనులు అను అర్పణ పరిశుద్ధాత్మ వలన పరిశుద్ధ పరచబడి ప్రీతికరమగునట్లు నేను సువార్త విషయమై యాజకధర్మము జరిగించుచు దేవుని చేత నాకు అనుగ్రహింపబడిన కృపను బట్టి అన్యజనుల నిమిత్తము పరిచారకుడనైతిని". పౌలు ద్వారా సువార్త నంగీకరించిన వారిని ప్రీతికరమగు అర్పణగా పౌలు ఎంచాడు. ఈ లేఖన భాగము లేవీకాండములోని మాటల నెవవేర్పును నేరుగా సూచించు చున్నది.

సంగ్రహముగా క్రైస్తవఆరాధన సమర్పణతో ఆరంభించును (యిది లేవీయుల యాగములో మొదటి దశ). అతడు సజీవమైన పరిశుద్ధ మైన దేవునికి అనుకూలమైన అర్పణయై యున్నాడు. దేవుడిచ్చిన ఆర్థిక ఫలములను ఆయనకు హృదయ పూర్వకముగా అర్పిస్తాడు. సువార్త వ్యాప్తి కొరకు కృషిచేస్తాడు. హెబ్రీయుల నైవేద్యార్పణ అంతయు మొదట క్రీస్తులోను తదుపరి ఆయన ప్రజల లోను సంపూర్తిగా నెరవేరు చున్నది.

**గమనిక :**

**సత్యవాక్కు సాలు చందా మీరు ఇంకను పంపని యెడల వెంటనే పంపించండి. మీ బంధు మిత్రులు ఈ పత్రిక చదివేలాగున ప్రోత్సహించండి.**

**- ఎడిటర్**

www. satyavanicoc.com

# సంతోషానికి సూత్రము
## (The key to Happiness)

ప్రతి దేశములోను యున్న ప్రతి మానవుడు సంతోషాన్నికోరు కొంటాడు. నేను చూచిన ప్రతి సర్వేలోను మానవుని యొక్క ముఖ్యగమ్యము సంతోషమే యని గమనించాను. అందరు సంతోషాన్ని కోరుకొనినా, చాల తక్కువ మందియే నిజానికి దానిని సాధించు చున్నారు. అయినను చాలమంది సంతోష సమయాన్ని అనుభవిస్తారు. తాత్కాలిక ఆనందాన్ని ప్రసాదించే అనేకసంగతులను చేస్తారు, పైకి ధన్యులుగా అగుపడ్తారు గాని అంతరంగికముగా అసంతృప్తితోను, నిరుత్సాహముతోను, నిస్పృహతోను నిండి యుందురు. ప్రతివాడు ఆనందాన్ని వెదుకుచున్నా, ఈలోకం అంతా సంతోషం లేని వారితో నిండియున్నది. యిది ఎందువలన ?

దీని జవాబు చాల సులభమే. ప్రజలు కాని ప్రదేశములలోను, కాని విధములుగాను సంతోషాన్ని వెదుకు చున్నారు. ఈలోక ధనంతో సంతోషం కలుగునని చాలమంది తలస్తారు, అయితే శాశ్వత సంతోషాన్ని ఈలోక ధనం సంపాదించి పెట్టలేదు. పేరు ప్రఖ్యాతులు గల ధనవంతుల జీవితాన్ని ఒకసారి చూడుము. కావలసిన దంతా వారికున్నది. పేరు ప్రఖ్యాతి, ధనం. వారు విలాసవంతమైన భవనములలో నివసిస్తారు, విలువైన వస్త్రములను ధరింతురు, విలాసవంతమైన పార్టీలకు తరుచు వెళ్తారు. వారి జీవితం సుఖమయమన్నట్లుగుపడ్తాది. గాని లోలోపల వారి జీవితాలు పైకి కనబడు విధంగా లేవని అంగీకరిస్తారు. వారు నిరుత్సాహవంతులై మాదకద్రవ్యములకు, మత్తుపానీయములకు, మత్తుమందులకు బానిసలై యుందురు. చాలమంది కుటుంబ సమస్యలు, పిల్లలు సమస్యలు, వివాహసమస్యలతో సతమతమవుచు యుంటారు. తరుచు వారు ఒక సమస్య నుండి ఇంకొక సమస్యకు వెళ్లుచు యుంటారు. గనుక, నిజానికి యిది సంతోషానికి సూత్రము కానేరాదు.

అట్టి విలాసవంతమైన జీవితము వలన సంతోషం కలుగునని నీవంగీకరించ వచ్చును. గనుక ఒక మోస్తరు ఆదాయము, జీవిత విధానంలో సంతోషం దొరకవచ్చునేమో! సుఖమయమైన ఆదాయము వుంటే, అతడు సంతోషంతో జీవించగలడు. సమస్య యేమంటే మానవునికి ఎంతవున్నా, అతనికి ఇంకా

కావాలి ! అతని ఆదాయము పెరిగేకొలదీ అతని అవుసరాలు, కోరికలు అధికమవుతాయి ఒకని ఆదాయము హెచ్చయినా, తక్కువైనా సుఖమయమైన జీవితం కావాలంటే తాను సంపాదించే దానికంటె రెండురెట్లు ఎక్కువ కావాలని ఒక సర్వేలో తేల్చబడింది. గనుక అంతరంగిక సంతృప్తి, సంతోషము మనకు తేల్చబడింది. గనుక అంతరంగిక సంతృప్తి, సంతోషము మనకు ఎన్నడులభించనట్లే యగుపడుచున్నది.

యోహాను సువార్త 13వ అధ్యాయములో యేసు నిజమైన సంతోషానికి సూత్రము నిచ్చియున్నారు. అది మానవ తలంపులకు పూర్తిగాభిన్నమైనది. ప్రభు రాత్రి భోజనమును మన ప్రభువు స్థాపించిన సందర్భము అది. తాను త్వరలో చనిపోబోవుచున్నానని ఆయన తన శిష్యులకు విపులీకరించారు. నిజానికి 24 గంటలలో అది జరుగబోవుచున్నది. ఆయన మరణించును. వారు భోజనము చేయుచుండగా యేసు ఒక అనూహ్యమైన పని చేసారు. ఆయన తన శిష్యుల పాదములు కడిగారు.

ఆరోజులలో ప్రజలు చెప్పులు తొడిగేవారు. మట్టిరోడ్ల మీద నడుచుట వలన వారి పాదములు చాలమురికిగా యుండేవి. గనుక విందుకు పిలిచినవాడు అతిథుల పాదములను కడిగేవాడు. అది చాల న్యూనత గల పని. పిలిచిన వాడు ధనవంతుడైతే అతని బానిసలు అతిథుల పాదములను కడిగేవారు. ఈ సందర్భములో విందు యజమాని ఎవరు లేరు. శిష్యులలో ఎవడును ఈ హీనమైన పని చేయుటకు ముందుకు రాలేదు. తత్ఫలితముగా ఆగది అంతయు గర్వహృదయములతోను, మురికి కాళ్లతోను నిండి యుండెను. యేసు లేచి వారందరు అనుసరింపతగిన మాదిరిని చూపించారు. రాజులకు రాజు అతి న్యూనత గల పని చేయుటకు మొదలు పెట్టారు. ఆయన వారి పాదములు కడిగారు.

యోహాను 13:17లో సంతోషము యొక్క సూత్రము మనము కనబడును: "ఈ సంగతులు మీరు ఎరుగుదురు గనుక వీటిని చేసిన యెడల మీరు ధన్యులగుదురు". ధన్యత అను ఈ పదము బాహ్యపరిస్థితులపై ఆధారపడని అంతరంగిక ఆనందమును వర్ణించుచున్నది. యితరులకు పరిచర్య చేయుటలో నిజమైన సంతోషము లభించునని యేసు మనకు బోధించుచున్నారు. యితరులకు సేవ చేయుట వలన సంతోషము కలుగునని మనము సాధారణంగా తలంచము. యితరులు మనకు సేవ చేస్తే మనము సంతోషిస్తాము. గాని యేసు ఇట్లు చెప్పారు: "మీలో అందరికంటె గొప్పవాడు మీకు పరిచారకుడై యుండవలెను" (మత్తయి 23:11).

యిట్టి స్వభావము మనము ఎట్లు కలిగి యుండగలము? దీనికంతటికి ఆధారము ప్రేమయే. ప్రేమ వలన మనం చేయకూడని పనులు చేయగలము. "యేసు తన వారిని ప్రేమించి, వారిని అంతము వరకు ప్రేమించెను" అని యోహాను 13:1 చెప్పుచున్నది. అనగా ఆయన సంపూర్ణముగా, పరిమితిలేకుండా ప్రేమించెను. గనుక ఇట్టి పనులను ప్రేమ వలన మాత్రమే మనము చేయగలము. తదుపరి యోహాను 13:3 ను గమనించుము. సంగ్రహముగా యిట్టి మనస్సు కలిగి యుండుటలో యేసు మూడు సంగతులు ఎరిగియుండెను. తానెవరో ఆయన ఎరిగి యుండెను, ఆయన దేవుని కుమారుడు. ఆయన ఎక్కడ నుండి వచ్చెనో ఎరిగి యుండెను. ఆయన పరలోక మహిమలన్నిటిని యిష్టపూర్వకముగా విడిచివచ్చెను. ఆయన ఎక్కడికి వెళ్ల వలసి యున్నదో కూడ ఎరిగియుండెను. ఆయన తండ్రియైన దేవుని యొద్దకు తిరిగి వెళ్లుచుండెను. క్రైస్తవులైన మనము కూడ ఈ మూడు సంగతులను ఎరిగి యున్నాము. మనం ఒకప్పుడు పాపములో బడి నశించిపోయినవారమని ఎరుగుదుము. మనం దేవుని బిడ్డలమని కూడ ఎరుగుదుము.మరియు క్రీస్తుతోడి వారసులమని కూడ మనం ఎరుగుదుము. గనుక ఈలోకంలో గొప్ప భద్రతగల వారమై యున్నాము. గొప్ప భద్రతగల వారే యితరులకు సేవ చేయగల్గుదురు.

ఈ సంతోష సూత్రమును యితరుల కూడ ఎరిగి యున్నారు. ఆల్బర్ట్ స్వెట్జర్ అనునతడు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సంగీతకారుడు, వేదాంతి. తన 30 వ యేట వైద్య కళాశాలలో ప్రవేశించి పట్టభద్రుడయ్యెను. అతడు ఆఫ్రికా వెళ్లి గేబాను ప్రాంతములో యున్న ప్రజలకు వైద్య సేవలందించెను. 1952 లో అతనికి నోబెల్ శాంతి బహుమానము లభించెను. ఆ ధనముతో ఆఫ్రికాలోని తన ఆసుపత్రిని అతడు విస్తరించెను. ఆఫ్రికా ఖండములో అడవులలో అనాగరిక ప్రజల మధ్య జీవిస్తు అతడు అనేక కష్టనష్టముల కోర్చెను. అతడు మరణించకముందు ఇట్లు చెప్పెను : "నీ అదృష్టము ఎట్లుండునో నాకు తెలియదు, గాని ఒకటి మాత్రము నేనెరుగుదును, మీలో పరిచర్యచేయుట ఎవరు వెదకి కనుగొందురో వారే సంతోషభరితులగుదురు".

నీవు నిజముగా సంతోషముగా యున్నావా? దీని సూత్రము విన ప్రమత గల పరిచర్యలో యున్నది. ఈ సూత్రము అందరు పాటించ వచ్చును. నీవెంత ధన వంతుడవైనను, ధనహీనుడవైనను సరే, ఎంత విద్యా వంతుడవైనను విద్య

లేని వాడనైనను సరే, ఏదేశస్థుడవైనను సరే ఈ సూత్రమును నీవును పాటించ వచ్చును. దేవునికి, యితరులకు ప్రేమ వలన పరిచర్యచేయుటకు ఎవరు యిష్ట పడుదురో అట్టి వారికి సంతోషము లభిం చును. ఒక సేవకునివలె జీవించుము.

అప్పుడు నీవు అంతరంగిక శాంతిని, సంతోషాన్ని, సంతృప్తిని పొందగలవు. అందరు కోరుకొనేది అదే. దేవుడట్లు వాగ్దానము చేసారు. నీవు దానిని నమ్ముదువా?

- జెర్రీ బేట్స్

## తిరిగి బైబిలు నొద్దకు
## (Back to the Bible)

క్రైస్తవులు దేవుని వాక్యమును ప్రక్కనబెట్టి దాని స్థానమున మానవకల్పిత సిద్ధాంతములనుంచుట వలన క్రైస్తవ లోకము నేడున్న స్థితిలో యున్నది. పరలోకమందున్న దేవునికి బదులు ఒకమానవునికి మానవుడు నమస్కరిం చుట విచారకరము. అందువలన వణు కుచు, దుఃఖముతో "ప్రభువా మేమేమి చేయుచున్నామో దాని నెరుగము గనుక మమ్మును క్షమింపుమని" అయనను మనం వేడుకొనాలి.

మానవులందరు బైబిలు నొద్దకు తిరిగి రావలయును. ప్రతి దానికి "దేవుడిట్లు చెప్పుచున్నాడు" అని మనం చెప్ప గలిగి యుండాలి. అట్లు జరగాలని పౌలు చెబుతు ఇట్లునుచున్నాడు:" దైవ జనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవా వేశము వలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమో 3:16-17). లేఖనములు మానవుని ప్రతి సత్కార్య మునకు సంపూర్ణునిగా చేయుచు న్నప్పుడు, వాటిని విడిచి వేరొక చోటకు పోవలసిన అవసరం యేమున్నది? అట్టివాడు సత్యమును ప్రేమించ వలసిన రీతిగా ప్రేమించుట లేదని యర్థము.

ఆత్మీయ విషయాల్లో బైబిలు గ్రంథము ఏకైక సంపూర్ణ గ్రంథమని క్రీస్తు సంఘము గుర్తించును. అందు వలన ఈ క్రీస్తు సంఘము బైబిలు మాట్లాడు చోటమాట్లాడుదుము, అది మౌనియైన చోటమౌనులుముగా యుందుము అని చెప్పుచు అట్లుండు టకు ప్రయాసపడుచున్నది. మరియు బైబిలు సంగతులను బైబిలు ప్రకారమే చేయుటకు అది ప్రయత్నించును.

అందువలన మాచుట్టు యున్న భక్తి పరులందరు ప్రతి సంగతి బైబిలును బట్టియే చేయవలెనని వారికి మా విజ్ఞాపనయై యున్నది. ఒకడు బైబిలును బట్టినడుచుకొనునంతకాలము, అతడు పొరబాటుచేయడు. గాని అతడు దాని నుండి తొలగిపోయినప్పుడు అతని శ్రమలు అధికమగును.

బైబిలు చెప్పుచున్న రీతిగ దానిని నమ్మినయెడల సంఘమును గూర్చిన సత్యము విషయమై మనం బైబిలు నొద్దకు తిరిగి రావాలి. "ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతళలోక ద్వారములు దానియెదుట నిలువనేరవని" క్రీస్తు చెప్పారు (మత్తయి 16:18). ఆయన తన సంఘమును స్థాపించుటకు వాగ్దానము చేసారు, ఆయన దానిని నెరవేర్చారు (అపొ.కా. 2). ఇప్పుడు మనం ఆయన సంఘసభ్యులమా ?

బైబిలు మానవుని సర్వసంపూర్ణ మార్గదర్శి గనుక, సువార్త విషయంలో మనం బైబిలు నొద్దకు తిరిగి రావాలి. అనేక కల్పిత సువార్తలు బోధింపబడుచున్నాయని నీవెరుగుదువు. గాని లేఖనములను మనం పరిశోధిస్తే మనలను రక్షించే సువార్త ఒకే ఒక్కటి యున్నది. అది యేసు క్రీస్తు సువార్తయైయున్నది: "సువార్తను గూర్చి నేనుసిగ్గుపడువాడనుకాను, ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగు జేయుటకు అది దేవుని శక్తియై యున్నది" (రోమా 1:16). సువార్తను విశ్వసించి దానికిలోబడుటకు ఒకడు తన పాపముల విషయమై మారు మనస్సు పొందవలెను, క్రీస్తును ఒప్పుకొనవలెను మరియు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను (మార్కు 16:16; అపొ.కా. 2:38).

బైబిలు దేవుని గ్రంథము గనుక, ఆరాధన విషయం మనం బైబిలు నొద్దకు మరలవలెను. ఒకడు మంచి మనస్సుకలిగి యుంటే తన యిష్టం వచ్చినట్లు ఆరాధించవచ్చుని కొందరు చెబుతు యుంటారు. అయితే ఈ సిద్ధాంతము బైబిలు నందగుపడదు. "దేవుడు ఆత్మ గనుక ఆయన నారాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెనని" క్రీస్తు చెప్పెను (యోహాను 4:24). యదార్థముగా ఆరాధించువారు ప్రతి ఆదివారమున ఆరాధనకు కూడుకొనవలెను. ప్రార్ధనచేయవలెను, బైబిలు పఠనము జరిగించవలెను, ప్రభురాత్రి భోజనము జరిగించవలెను, పాటలు పాడవలెను మరియు కానుకలీయవలెను (లూకా 18:12, 2 తిమోతి 2:15; కొలస్స 3:16;

అపో.కా. 20:7; 1 కొరింథీ 16:2). ఈ సత్యపు వెలుగులో దేవుని మనం అంగీకారయోగ్యముగా ఆరాధించుచున్నామా ?

మనం దేవునికి లోబడగోరిన యెడల, క్రైస్తవ జీవనమును గూర్చి బైబిలు నొద్దకు మరల రావలెను. ఒకసారి రక్షింపబడిన వాడు ఎల్లప్పుడు రక్షింపబడే యుండునని బైబిలు ఎక్కడా బోధించుటలేదు. సరిగదా మనం నిత్య రక్షణ పొందవలెనంటే ప్రభువుకు ఎల్లప్పుడు నమ్మకముగా యుండాలని లేఖనములు బోధించుచున్నవి. ఏలయనగా "మరణము వరకు నమ్మకముగా యుండుము, నేను నీకు జీవకిరీట మిచ్చెదనని" లేఖనములు చెప్పుచున్నవి (ప్రక 2:10). నిజ క్రైస్తవునిగా యుండాలంటే ఒకడు అన్ని విషయములలోను ప్రభువుకు ప్రథమ స్థానమునియ్యాలి. వీటన్నిటి విషయములో మనము క్రొత్త నిబంధన క్రైస్తవులమని చెప్పగలమా?

అవును మనం చెప్పుకొనిన సంగతుల విషయములో మనం బైబిలు నొద్దకు మరలాలి. అంత మట్టుకు కాదు నామము విషయ ములో బైబిలు నొద్దకు మరలాలి (1 పేతురు 4:16). పునాదిని గూర్చి (1 కొరింథీ 3:11). సంఘ శిరస్సును గూర్చి (ఎఫెసీ 5:23). రక్షించు విశ్వాసమును గూర్చి (ఎఫెసీ 4:5). నిజబాప్తిస్మమును గూర్చి (కొలస్స 2:12), సత్య మార్గమును గూర్చి (యోహాను 14:6). మరియు నీతిని గూర్చి, భక్తిని గూర్చి అన్ని విషయాల్లో మనం బైబిలు నొద్దకు తిరిగి వెళ్ల వలెను! (యోహాను 8:32; తీతు 2:11,12). – జె.సి. ఛోట్

## జన్మ పాపము

క్రైస్తవ బోధకులు కొందరు తాము చేయు బోధలలో "మనము కర్మపాపమునుండియు, జన్మపాపము నుండియు విడుదల పొందవలయును" అను మాటలు అనాలోచనగ విసరి వేయుదురు. కర్మపాపమును గూర్చి బైబిలు మొదటి నుండి చివర వరకు ఘోషించుచున్నది గాని జన్మపాపమును గూర్చి ఎచ్చటను చెప్పుటలేదే. బైబిలులో జన్మపాపము గలదని నమ్మువారు చెప్పున దేమన – "మనం ఆదాము సంతతివారము గాన తరతరములు అతని పాపము పయనించి మన తల్లిదండ్రులకును వారి నుండి మనకును సంక్రమించినది. అందుచే మనము జన్మనుండియే పాపులమైతిమి".

జన్మచే ఆదాము పాపము మనకు సంక్రమించినదా ? లేదా ఆ పాప ఫలితము

మనకు సంక్రమించినదా? ఈ రెంటికిని గల వ్యత్యానము మనము జాగ్రత్తగ గుర్తించవలయును. ఆదాము పాప ఫలితం మరణము. ఆ మరణములో మనము పాలి భాగస్తులము. గాని అతని పాపములో మనకు పాలులేదు. ఒకడు త్రాగుబోతై ఆ మత్తులో మరొకని హత్య చేసినాడు. ఖైదు పాలైనాడు. తండ్రి సంపాదనపై ఆధారపడిన బిడ్డలు దారిద్ర్యమునకు గురియైనారు. అతని పాపఫలితము "లేమి". ఆ లేమినే వారు అనుభ వింపవలసి యుందురు గాని తండ్రి పాపమును బట్టి బిడ్డలు త్రాగుబోతులని, నరహంతకులని పిలువబడరు.

మనము జన్మము నుండియు పాపులముకాము అని సూచించు కొన్ని బైబిలు వాక్యములుచూతము.

**1.** దేవుడు నరులను యథార్థ వంతులుగా పుట్టించెను గాని వారు వివిధములైన తంత్రములు కల్పించుకొని యున్నారు (ప్రసంగి 7:29).

ఈ వాక్యములో మనము స్పష్టముగ చూచునదేమి? పాపముతో మనము జన్మించ లేదనియే గదా. ఈలోకమందు జన్మించు ప్రతివాడు దొంగ బిడ్డగాని, దొర బిడ్డగాని ప్రతివాడు నిర్దోషియే.

**2.** మన ప్రభువైన యేసు చెప్పునదేమి? "చిన్న బిడ్డలను ఆటంకపరచక నా యొద్దకు రానీయుడి. పరలోక రాజ్యము ఈలాటి వారిదే (మత్తయి 19:14). పరలోక రాజ్యమునకు అర్హులెవరు ? పరిశుద్ధులు. అటువంటి పరిశుద్ధ హృదయము కలిగినవారు చిన్నబిడ్డలు అని యేసుప్రభువు చెప్పుచున్నారు. కనుక జన్మపాపమెక్కడ?

**3.** కుమారులు యెహోవా అనుగ్రహించిన స్వాస్థ్యము. గర్భఫలము ఆయన యిచ్చు బహుమానమే (కీర్త 127:3). దేవుడు మనకిచ్చు బహుమానము శ్రేష్టమైనది, పాప రహితమైనది.

**4.** హెబ్రీ 12:9లో మనకు రెండు రకములైన తల్లిదండ్రులు గలరు అని చెప్పుచున్నాడు-1) శరీర సంబంధులైన తల్లిదండ్రులు 2) ఆత్మలకు తండ్రియైన దేవుడు. శరీర సంబంధులైన తల్లిదండ్రుల ద్వారా మనకు శరీరము దొరికినది. ఆత్మల తండ్రియైన దేవుని వలన మనకు ఆత్మ అనుగ్రహింపబడినది. ఆయన వలన మనము పొందిన ఆత్మ పరిశుద్ధమైనదా, పాపసహితమైనదా?

**5.** ఈ పై వాక్యములో గల భావమే ప్రవక్తయైన జెకర్యా మరొక రీతిని చూపుచున్నాడు. 12:1 వచనములో "మనుష్యుల అంతరంగములో

జీవాత్మను సృజించు యెహోవా సెల విచ్చునదేమన".

ఈ వాక్య భావమేమి? మన తల్లిదండ్రులు మనకు శరీరమునివ్వగా దేవుడు తన వంతునకు ఒక్కొక్క బిడ్డకు ఒక్కొక్క జీవాత్మనిచ్చి యీ లోకమునకు పంపుచున్నాడు. అందువలన పుట్టిన ప్రతి బిడ్డ పరిశుద్ధుడే లేక నిర్దోషియే.

**6.** ఇస్సాకు కుమారులైన ఏశావు యాకోబులను గూర్చి వ్రాయబడినదేమి? "పిల్లలింకను పుట్టి మేలైనను, కీడైనను చేయకముందే...." (రోమా 9:10–12). ఈ మాటల భావమేమి ? పుట్టబోవు బిడ్డలలో దోషమేమియు లేదనియే గదా !

పైన చూపబడిన వాక్యములను బట్టి మనము నిశ్చయించునదేమి? జన్మ పాపమనునది లేదనియే గదా. జన్మ పాపము గలదని చెప్పువారు బైబిలునుండి ఒకే వాక్యము నెత్తి చెప్పుదురు – కీర్తన 51:5. దావీదు తాను జరిగించిన పాపమును గూర్చి గద్దింపబడినవాడై పశ్చాత్తాపముతో కృంగి ఈ కీర్తన వ్రాసి నాడు. "నేను పాపములో పుట్టినవాడను. పాపములోనే నా తల్లి నన్ను గర్భము ధరించెను". ఈ వాక్యము నుండి దావీదు తన తల్లి గర్భము నుండి పాపముతో జన్మించినాడని పాపముతో జన్మించెనని చెప్పలేదు అని తేటగ గ్రహింపవలెను.

తన కుటుంబ పరిస్థితులను తలంచుకొని తన్నుతాను నిందించు కొన్నాడు అంతియేగాని తల్లి గర్భము నుండి వచ్చినపుడే పాపముతో వచ్చినానని చెప్పలేదు. తాను పాపముతో జన్మించితినని నమ్మి యుండిన, తాను జరిగించిన పాపమునకు తల్లినే నిందించి యుండును. కాని ఈ కీర్తన అంతయు మనము చదివినపుడు, దావీదు తన్నే నిందించుకొన్నట్లు స్పష్టమగుచున్నది.

One Volume Peak's Commentary లో ఈ వ్యాఖ్యాన మున్నది. "ఈ కీర్తన వ్రాసినవాడు అందరివలెనే పాపముతో నిండిన వంశము నుండి జన్మించితినని చెప్పుచున్నాడు. ప్రతివానిలో పాపము వైపు మొగ్గు నైజము గలదు. దానిని జన్మ పాపమని చెప్ప వీలులేదు".

Dr. O.M. Rao అను బాప్టిస్టు పండితుడిట్లు వ్రాయు చున్నాడు. "మానవ చరిత్రలో ఒకానొక కాలమందు పాపము ప్రవేశించినది. మన మందరమును పతనమైన మానవ జాతికి చెందున వారము. అంతలో పాపము జన్మ

నుండి కలిగినదని చెప్పవచ్చునా? జన్మ పాపమును గూర్చిన భావములు బిషప్ సిప్రియన్ వ్రాతలలో తలయెత్తినవి. అతడు చిన్న బిడ్డలలో గల జన్మపాపమును తీసివేయుటకు వారికి బాప్తిస్మ మీయ వలెనని వ్రాసినాడు. పాపము వైపు మొగ్గు నైజము మనకు గలదు గాని పాపముతో మనము జన్మించలేదు.

యిర్మియా, యెహెజ్కేలు ప్రవక్తలు ఇశ్రాయేలు జనాంగము జన్మపాపమను భావము వైపు మొగ్గుట గమనించినపుడు వారే అవసరమైన అడ్డంకులు వేసిరి. "తల్లిదండ్రులు ద్రాక్షకాయులు తినగ పిల్లలు పళ్ళు పులిసెనను మాట యిక చెప్పరు. ప్రతివాడు తన దోషము చేతనే మృతి నొందును. ఎవడు ద్రాక్ష కాయలు తినునో వాని పళ్ళే పులియును" – యిర్మి 31:23,30. మరియు యెహెజ్కేలు 18:4 చూడుడి. కనుక మన మీదికి వచ్చిన పాపమును గూర్చి మనము ఆదామును నిందించనక్కరలేదు. మన పాపమునకు మనమేబాధ్యులము.

**జన్మపాపము – చిన్న బిడ్డల బాప్తిస్మము:**

మానవుడు జన్మనుండియే పాపియను సిద్ధాంతము మరొక పొరబాటు నకు దారి తీసినది. అది చిన్నబిడ్డల బాప్తిస్మము. దీనిని గూర్చి కొందరు "క్రైస్తవ భక్తులు" వ్రాసినది గమనింతము.

1. బాప్తిస్మము పొందని చిన్న బిడ్డలు చనిపోవుట తటస్థించిన రక్షణను పోగొట్టు కొందురు. –Bishop Cyprian

2. చిన్న బిడ్డలకు పసితనమున బాప్తిస్మ మియ్యనిచో అగ్నిగంధకముల గుండ ములో వారు బహువేదనలు పొంద వలసి వచ్చును. – St. Augustine

3. చిన్నబిడ్డలకిచ్చు బాప్తిస్మము వారి జన్మపాపమును కడిగివేయును గనుక వారికి తప్పక బాప్తిస్మ మీయవలెను.
– John Wesley

4. జన్మ పాపమను మురికినుండి చిన్న బిడ్డలు శుద్ధులు కావలసి యున్నారు. అందుచే వారికి బాప్తిస్మ మీయవలెను.
– Dr. Wall

లేని పాపమును చిన్న బిడ్డల కంటగట్టుట ఒక పొరబాటు. మరియు వారి పాప నివారణ కొరకని దైవ వాక్యములో లేని బాప్తిస్మమును సృష్టించి పాప మెరుగని వారి పాప నివారణకై వారిని దానికి లోను చేయుట మరొక పొరబాటు.

మానవ కల్పిత సిద్ధాంతములు మత చరిత్రలో ప్రారంభము నుండి మనుష్యులను కలత పరచుచున్నవి. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని వారు చేయు బోధలు యెషయా దినములలో యూద

సమాజమును కలతపెట్టినవి (యెష 29:13). యేసుప్రభు దినములలో శాస్త్రులు, పరిసయ్యులను కలత పెట్టినవి.....(మత్త 15:9). నేటి దినములలో క్రైస్తవ సంఘములో గల తప్పు సిద్ధాంతములననేకమైన వాటిని విడచినను మనమిక్కడ చూచిన వాటిని విడువలేకపోయిరి. కారణమూహింప లేము.

**పాపమెట్లు కలుగును ?**

ఇంత వరకు పాపము జన్మ నుండి కలుగదు అని చూచితిమి. మరి పాపమేలాగు కలుగును ? కర్మవలననే. ఒక కార్యము మంచిదని, మరొకటి కాదని ఎట్లు నిర్ణయించగలము?

పాప మననేమో చెప్పుటకు బైబిలు రెండు నిర్వచనములు చేయు చున్నది.

**1.** ఆజ్ఞాతి క్రమము పాపము -1 యోహా 3:4. అనగా చేయవలసినది చేయక పోవుట మనము ఏది చేయ వలయునో, ఏది చేయకూడదో బైబిలే స్పష్టము చేయుచున్నది.

**2.** మేలైనది చేయు నెరిగియు అలాగు చేయని వానికి పాపము కలుగును (యాకో 4:7). అనగా ఒక కార్యము మంచిది అని ఎరిగియుండియు అది చేయనిచో పాపమగును.

మానవులమైన మనము ... (చిన్న బిడ్డలతో సహా) మేలు, కీడుల మధ్యనున్నాము (రోమా 7:18). జీవన మరణముల మధ్యనున్నాము (ద్వితి 30:15). దేవునికి, దయ్యములకును మధ్యనున్నాము .. (యెహో 24:15). లేదా ఇరుకు విశాల మార్గముల మధ్య నున్నాము (మత్తయి 7:13,14). మనము పోవునది కుడివైపునకా, ఎడమ వైపునకా? ఏదో మనమే నిర్ణయించు కొనవలయును. మన భావి మన చేతుల లోనే ఉలదు. అలాగే చిన్న బిడ్డయు పెరుగు కొలది ఏదో యొక వైపునకు పోవుటకతడే ఏర్పరచుకొనును. మంచి చెడ్డలనెరిగి ఏర్పరచుకొను వయస్సునకు యుక్త వయస్సు అందుము(Age of accountability ఎరిగి అతడు తప్పు చేసినపుడే పాపియనబడును. అంత వరకు కాదు.

మనము దేవుని వాక్యమును ప్రేమించినచో ఆయన ఆజ్ఞలు గైకొం దుము. వాక్యమందు లేని దానిని ఊహించి వాక్యము యొక్క స్థానము లోనికి అట్టివి ప్రవేశపెట్టకుండునట్లు ప్రభువు మనలను నడిపించును గాక.

- కీ.శే. టి. జ్ఞానానందం

(SW 8/2000)

2015 మే నెల 10 వ తేదీ సాయంత్రం రామచంద్రపురం పదంవారి పేటలో యున్న స్థానిక సువార్తికులు యన్. ప్రసాద్‌గారి 20వ వివాహవార్షికోత్సవము ఘనముగా జరిగెను. సోదరులు సుగుణరావు గారు అధ్యక్షతవహించగా జాషువాగారు వాక్యపరిచర్య చేసిరి. హాజరైనవారందరికీ అల్పాహారము అందియ్యబడెను.

2015 మే నెల 11,12, 13, 14 తేదీలలో సికింద్రాబాద్ యాప్రాల్‌లో యున్న క్రీస్తుసంఘము వేసవి కాల బైబిలు తరగతులు (Vacation Bible School) నిర్వహించిరి. అనేక మంది యౌవనస్థులు హాజరైరి. సోదరి కేథరిన్ లెమూయేలు, సలోమికిరణ్, వివేక్ గారు వారి సతీమణి తదితరులు బైబిలు క్లాసులు బోధించిరి. ఆనాలుగుదినములు హాజరైనవారందరికీ అల్పాహారమును లెమూయేలు గారు ఏర్పాటు చేసిరి. అందరికీ ఆఖరిదినమున బహుమతులు అందియ్యబడెను. మరియు కిషోర్ సుధ దంపతులు ఆఖరి దినమున మంచి భోజనము సరఫరాచేసిరి. అందరు క్రీస్తులోయున్న ప్రేమను, సహవాసమును రుచిచూచి దేవుని స్తుతించిరి. యాప్రాల్‌లో యున్న క్రీస్తు సంఘము, లెమూయేల్ దంపతులు చేయుచున్న దైవకృషిశ్లాఘనీయమైనది.

2015 ఏప్రియల్ 30వ తేదీనాటికి రిక్కీగూటం దంపతలు, వారి కుమారుడు జస్టిన్ గూటంగారు క్షేమముగా అమెరికా చేరుకొనిరి, రోనీ గూటం దంపతులు రెండు నెలలకు ముందుగానే అమెరికా చేరుకొని యున్నారను సంగతి పాఠకులకు విదితమే.

2015 మే నెల 20, 27, 28 తేదీలలో కాకినాడ మెక్లారెన్ హైస్కూల్ ఆవరణలో యేసుక్రీస్తు రక్షణసువార్త సభలను, పట్టణములో యున్న అనేక స్థానిక సంఘముల సహవాసముతో, సహకారముతో నిర్వహించబడుటకు ఈపత్రిక ముద్రించు సరికి ఏర్పాట్లుజరుగుచున్నవి. ఆ సభలలో జాషువా గూటం, టి.వి. సేంసన్‌రాజు, కె.జి. కుమార్, యమ్, సామ్యేలు రాజు, టి. ప్రసన్న కుమార్ మరియు కె.సూర్యారావ్ గార్లు వాక్యోపదేశము గావించనున్నారు. ప్రార్థించమనవి.

# సత్యవాణి
## T.V. కార్యక్రమములు

ప్రతి ఆదివారం సాయంత్రం 6.00 గంటలకు శుభవార్త ఛానల్

ప్రతి బుధవారం సాయంత్రం 6.30 గంటలకు రక్షణ ఛానల్

ప్రతి గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు రక్షణ ఛానల్

పతి ఆదివారం ఉదయం 7.00 గంటలకు మన కాపరి T.V
(గుంటూరు, తెనాలి ఏరియాలో)

ప్రతి మంగళ వారం ఉదయం 7.30 గంటలకు UCC మ్యూజిక్ ఛానల్‌లో (తూర్పుగోదావరిలో)

ఈకార్యక్రమములను తప్పక చూడండి ! మీ బంధుమిత్రులకు చూపించండి !!

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.